సాక్షి విశాఖపట్నం

గురువారం । 2 । నవంబర్ । 2023



అవినీతి రహిత దేశ నిర్మాణంలో..

అవినీతి రహిత దేశ నిర్మాణంలో భాగస్వాములవుదామని వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. 10లో



స్టీల్ ఉద్యోగులకు పతకాలు

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు అంతర్జాతీయ క్వాలిటీ సర్కిల్ పోటీల్లో మూడు బంగారు పతకాలు లభించాయి. 10లో



ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

తొలిరోజు 64.31 శాతం పింఛన్ల పంపిణీ



పెదజాలారిపేటలో కొక్కిర పాపమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మంగ

మహారాణిపేట: వైఎస్సార్ పింఛన్ కానుక బుధవారం రాత్రి 7 గంటల సమయానికి జిల్లాలో 64.31 శాతం పంపిణీ జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ విభాగం, నగర పరిధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో వలంటీర్లు బుధవారం ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ మొదలు పెట్టారు. జిల్లాలో 1,65,040 మంది పింఛన్‌దారులకు ప్రభుత్వం రూ.46.37 కోట్లు విడుదల చేసింది. తుది సమాచారం ప్రకారం జిల్లాలో 1,06,256 మందికి (64.31శాతం) రూ.29.82 కోట్లు అందజేశారు. ఐదు రోజుల్లో లబ్ధిదారులందరికీ పింఛన్లు అందజేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి తెలిపారు.

23 శిబిరాల్లో 11,198 మందికి వైద్య సేవలు

నేడు 20 ప్రాంతాల్లో శిబిరాలు



పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా బుధవారం నగరంలోని 23 ప్రాంతాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 11,198 మందికి సేవలందించినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులను పరీక్షించగా.. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు వెల్లడించారు. కాగా.. డీఎంహెచ్‌వో పలు శిబిరాలను సందర్శించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. గురువారం 20 ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: జిల్లాలోని అగనంపూడి, ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల్లో గెస్ట్‌ఫ్యాకల్టీగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇంటర్మీడియట్ జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి రాయల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్రం రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి విశ్రాంత అధ్యాకులు/స్కూల్ అసిస్టెంట్లు/ లెక్చరర్లు లేదా పీజీ కలిగి కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 3వ తేదీ సాయంత్రం 3 గంటల్లోగా పిఠాపురం కాలనీలో గల డీవీఈవో కార్యాలయంలో తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు అందజేయాలన్నారు.

మరో అంతర్జాతీయ సదస్సుకు

విశాఖ ముస్తాబు



- నేటి నుంచి 8వ తేదీ వరకు ఐసీఐడీ కాంగ్రెస్ ప్లీనరీ
- 57 ఏళ్ల తరువాత భారత్‌లో నిర్వహణ
- 74 దేశాల నుంచి 1,200 మంది ప్రతినిధులు రాక
- 1100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భద్రతా చర్యలు

తొలి రోజు ఇలా..

- గురువారం ఉదయం 9.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుంది.
- 9.35కు కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి దేబాశ్రీముఖర్జీ ప్రారంభోపన్యాసం చేస్తారు.
- 9.45కు ఐసీఐడీ అధ్యక్షుడు డాక్టర్ రాగబ్ సదస్సు విశేషాలను వివరిస్తారు.
- 9.55కు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు.
- 10.15కు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడతారు.
- 10.40కు ఐసీఐడీ చేసిన పబ్లికేషన్స్‌ను విడుదల చేస్తారు.
- 10.45కు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా వరల్డ్ హెరిటేజ్ ఇరిగేషన్ స్ట్రక్చర్ అవార్డులను అందజేస్తారు.
- 10.55కు ఐసీఐడీ ఉపాధ్యక్షుడు కుష్విందర్ ఓహ్రా వందన సమర్పణ చేస్తారు.

దొండపర్తి : మరో అంతర్జాతీయ సదస్సుకు విశాఖ సిద్ధమైంది. అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన ఐసీఐడీ కాంగ్రెస్ ప్లీనరీకి వేదికవుతోంది. 74 దేశాల అంబాసిడర్లు, మంత్రులు, ఇతర ప్రతినిధులకు అతిథ్యమిస్తోంది. ఇప్పటికే జీఐఎస్, జీ20 సదస్సులతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన విశాఖలో గురువారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ సదస్సు జరగనుంది. 57 ఏళ్ల తరువాత భారత్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు విశాఖ వేదికవడం విశేషం. సెంట్రల్ వాటర్ కమిషన్, ఏపీ జలవనరుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న ఈ సదస్సును గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. 'వ్యవసాయం నీటి కొరతను అధిగమించడం' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఐసీఐడీ అధ్యక్షుడు డాక్టర్ రాగబ్, ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో పాటు భారత్ నుంచి 300 మంది హాజరుకానున్నారు. అలాగే ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, చైనా, ఇండోనేషియా, ఇరాన్, ఇరాక్, ఇజ్రాయిల్, జపాన్, కొరియా, మలేషియా, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక, థాయిలాండ్, వియత్నాం ఇలా 74 దేశాల నుంచి 900 మందికి పైగా ప్రతినిధులు రానున్నారు. ఇదే వేదికపై 74వ అంతర్జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఐఈసీ) సదస్సు కూడా జరగనుంది. తొలిరోజు ప్రముఖుల కీలక ఉపన్యాసాలు ఉండగా.. 3, 4, 5, అలాగే 9వ తేదీన విశాఖ పర్యాటక ప్రాంతాలైన అరకు వ్యాలీ, బొర్రా గుహలు, తాటిపూడి రిజర్వాయర్ వంటి ప్రాంతాలను సందర్శించనున్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ సదస్సు విజయవంతంగా పూర్తయ్యేందుకు పోలీసులు 1100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

అత్యాధునిక నీటి పారుదల విధానాలపై..

ప్రపంచానికి జలభద్రత చేకూర్చడం, తక్కువ నీటితో అధిక విస్తర్ణంలో పంట సాగుకు దోహదం చేసే అత్యాధునిక నీటి పారుదల విధానాలపై సమావేశంలో చర్చించి ప్రదర్శించనున్నారు. 25వ కాంగ్రెస్ నిర్వహణ బాధ్యతలను భారత్ చేజిక్కించుకోగా.. సదస్సును విశాఖలో నిర్వహించాలని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ కె.యల్లారెడ్డి చేసిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదించారు. 74 దేశాలకు చెందిన మేధావులు, ప్రతినిధులు ప్రతిపాదించే అత్యాధునిక సాగునీటి విధానాలను పరిశీలించి వాటిని అమలు చేయడం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా, సుభిక్షంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నేడు సీఎం జగన్ విశాఖ రాక



మహారాణిపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖ వస్తున్నారు. ఉదయం 8.05 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 8.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో మధురవాడ ఐటీ హిల్ నెంబర్.3లో ఉన్న హెలిప్యాడ్‌కి 9.15 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా రుషికొండలోని రాడిషన్ బ్లూ రిసార్ట్‌కు వెళ్తారు. అక్కడ జరగనున్న 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్(ఐసీఐడీ) కాంగ్రెస్ ప్లీనరీలో 9.30 గంటల నుంచి 11 గంటల వరకు పాల్గొంటారు. అనంతరం రోడ్డుమార్గంలో మధురవాడ హెలిప్యాడ్‌కు 11.15 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 11.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

24 మంది సీఐలకు స్థానచలనం

- వీఆర్‌లో ఉన్న 12 మందికి పోస్టింగ్
- రేంజ్‌కు ముగ్గురు సరెండర్
- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్



దొండపర్తి: నగర పోలీస్ కమిషనరేట్‌లో భారీ స్థాయిలో ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఒకేసారి 24 మంది సీఐలను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సిటీ వీఆర్‌లో ఉన్న 12 మందికి పోస్టింగ్‌లు ఇవ్వగా ముగ్గురు సీఐలను రేంజ్‌కు సరెండర్ చేశారు.

ఇన్‌స్పెక్టర్	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
కోటా సురేష్	వీఆర్	నార్త్ సబ్-డివిజన్ క్రైమ్
బి.వి.జగన్నాథరాజు	వీఆర్	వెస్ట్ సబ్ డివిజన్ క్రైమ్
ఎల్.రేవతమ్మ	వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్	రేంజ్‌కు సరెండర్
బాసిన భాస్కరరావు	వీఆర్	వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్
వి.చక్రధరరావు	వీఆర్	ఈస్ట్ సబ్-డివిజన్ క్రైమ్
వి.వి.సి.ఎం.యర్రంనాయుడు	ఈస్ట్ సబ్‌డివిజన్ క్రైమ్	న్యూపోర్ట్‌లాఅండ్‌ఆర్డర్
కె.భవానిప్రసాద్‌రావు	సైబర్ క్రైమ్	సిటీ వీఆర్
ఆర్.సోమేశ్వరరావు	వీఆర్	సైబర్ క్రైమ్
మహమ్మద్ సనౌల్లా	సీఎస్‌బీ-3	సీసీఆర్‌బీ
బి.లూథర్‌బాబు	వీఆర్	సీఎస్‌బీ-2
ఎం.అవతారం	సీసీఆర్‌బీ	రేంజ్‌కు సరెండర్
సి.హెచ్.వెంకటరావు	వీఆర్	నార్త్ ట్రాఫిక్ సర్కిల్
ఎస్.అమ్మినాయుడు	వీఆర్	ఈస్ట్ ట్రాఫిక్ సర్కిల్-2
ఎస్.షణ్ముఖరావు	వీఆర్	సీసీఎస్-3
జి.గోవిందరావు	వీఆర్	సీసీఎస్-4
సిహెచ్.వాసునాయుడు	వీఆర్	సిటీ వీఆర్
ఎస్.రాము	న్యూపోర్ట్ లా అండ్ ఆర్డర్	సిటీ వీఆర్
ఎ.సంతోష్‌కుమార్	సిటీ వీఆర్	గోపాలపట్నం లా అండ్ ఆర్డర్
సిహెచ్.సింహాద్రినాయుడు	ద్వారకా లా అండ్ ఆర్డర్	ఎయిర్‌పోర్ట్ ఇమిగ్రేషన్
ఎస్.కాంతారావు	సిటీ వీఆర్	సిటీ వీఆర్
కె.దుర్గాప్రసాద్	సీఎస్‌బీ-2	సీఎస్‌బీ-3
హెచ్.మల్లేశ్వరరావు	ఎంవీపీ లా అండ్ ఆర్డర్	సిటీ వీఆర్
డి.శ్రీహరిరాజు	ఎయిర్‌పోర్ట్ ఇమిగ్రేషన్	రేంజ్‌కు సరెండర్
జి.సంజీవరావు	సిటీ వీఆర్	ఎంవీపీ లా అండ్ ఆర్డర్

4, 5 తేదీల్లో యూపీఎస్సీ పరీక్షలు

- జిల్లాలో హాజరుకానున్న 926 మంది అభ్యర్థులు



సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్వో మోహన్ కుమార్

మహారాణిపేట: యూపీఎస్సీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో యూపీఎస్సీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఈ నెల 4, 5 తేదీల్లో రెండు షిఫ్టుల్లో యూపీఎస్సీకి సంబంధించి కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో 926 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు యూపీఎస్సీ గైడ్ లైన్స్ తప్పకుండా పాటించాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. విద్యార్థులు పరీక్ష సమయం కంటే అరగంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఆర్టీసీ, పోలీస్, వైద్య, విద్యుత్ తదితర విభాగాల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో పరీక్షల విభాగం సూపరింటెండెంట్ పాల్ కిరణ్, విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, రెవెన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



రాడిసన్ హోటల్‌లో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ మల్లికార్జున, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం పరిశీలించారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించనున్న 25వ ఐసీఐడీ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో బుధవారం కలెక్టర్ హోటల్‌ను సందర్శించి, సమావేశ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జలవనరుల శాఖ కార్యనిర్వహక ఇంజనీర్ ఉమేష్‌కుమార్, భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కేంద్ర జల వనరుల శాఖ సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

1100 మంది పోలీసులతో పటిష్ట భద్రత

దొండపర్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖ వస్తున్న దృష్ట్యా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో గురువారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు జరిగే 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్(ఐసీఐడీ) సదస్సుకు దేశ, విదేశాల నుంచి 1,200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ మేరకు 1100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపడుతున్నారు.

- బందోబస్తును పలు కేటగిరీలుగా విభజించి, ఒక్కో విభాగానికి ఒక్కో పోలీసు ఉన్నతాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించారు.
- ఎయిర్‌పోర్ట్ వద్ద, పార్కింగ్, కాన్వాయ్, హెలిప్యాడ్, రాడిసన్ బ్లూ హోటల్‌తో పాటు విదేశీయులు బస చేసే అన్ని హోటళ్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు.
- నగరంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందిని నియమించారు.
- వీఐపీలు పాల్గొనే ప్రాంతాల్లో స్నిఫర్ డాగ్ బృందాలు, బాంబు స్క్వాడ్లతో తనిఖీలు చేపట్టారు.
- ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనే ముఖ్య వ్యక్తుల వాహనాలకు, కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే ఇతరుల వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ స్థలాలను కేటాయించారు.
- ఇప్పటికే సీపీ రవిశంకర్ సీఎం పర్యటించే ప్రాంతాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.
- సీపీ ఆదేశాల మేరకు డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) జి.నాగన్న బందోబస్తు విధులు నిర్వర్తించే అధికారులకు సూచనలు చేశారు.

రద్దీ ప్రాంతాల్లో సెల్లార్ పార్కింగ్ తప్పనిసరి

కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ

మహారాణిపేట: జిల్లాలోని రద్దీ ప్రాంతాలను గుర్తించి.. తగిన చర్యలు చేపట్టడం ద్వారా రహదారి ప్రమాదాలను నివారించవచ్చని కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, సూచనలపై ఇప్పటివరకు చేపట్టిన పనుల నివేదిక అందజేయాలన్నారు. మిగిలిన పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. రద్దీ ప్రాంతాల్లోని కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో సెల్లార్ పార్కింగ్ తప్పనిసరిగా ఉండాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. రహదారి భద్రత కమిటీ చేపట్టిన చర్యలతో గతంలో కంటే ప్రస్తుతం ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. రద్దీ కూడళ్ల వద్ద రహదారుల వెడల్పు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆశీలమెట్ట, మద్దిలపాలెం, బీచ్‌రోడ్, హనుమంతవాక జంక్షన్, కార్ షెడ్, బిర్లా జంక్షన్, బాజీ జంక్షన్, కంచరపాలెం మెట్టు, శ్రీహరిపురం, కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద గల సర్వీస్ రోడ్లను వెడల్పు చేసి రద్దీని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గాజువాక ప్రాంతంలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, జాతీయ రహదారిపై ఫ్లైఓవర్‌లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ నగరంలో ఫేజ్ -1, 2 కింద 32.79 కి.మీ మేర రహదారుల వెడల్పు పనులు చేపట్టినట్లు తెలిపారు. హైవే 16 నుంచి రేవళ్లపాలేనికి 80 అడుగుల రహదారి, రేవళ్లపాలెం నుంచి నవోదయ స్కూల్ వరకు 100 అడుగుల రహదారి విస్తరణ, హైవే నుంచి కొమ్మాదికి 100 అడుగుల రహదారి విస్తరణ, హైవే నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ వరకు రహదారి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఇప్పటికే అన్ని కూడళ్ల వద్ద బస్ బేలు ఏర్పాటు చేశామని, బ్యూటిఫికేషన్ పనులు చేపడుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. హైవే, జిల్లా రహదారుల పక్కన ఆక్రమణలు తొలగించాలన్నారు. ఆర్టీవో ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు గత సమావేశం నుంచి ఇప్పటి వరకు చేసిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఆర్అండ్ బీ పర్యవేక్షక ఇంజనీర్ కె.కాంతిమతి, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ, సిటీ ప్లానర్ కె.ఎం.దొర, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్వాలిటీ సర్కిల్ పోటీల్లో బంగారు పతకాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు అంతర్జాతీయ క్వాలిటీ సర్కిల్ పోటీల్లో మూడు బంగారు పతకాలు లభించాయి. చైనా అసోసియేషన్ ఆఫ్ క్వాలిటీ (సీఏక్యూ) ఆధ్వర్యంలో గత నెల 30 నుంచి బీజింగ్‌లో ఇంటర్నేషనల్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ కన్వెన్షన్ నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగానికి చెందిన 'రాకర్స్', ఎస్‌బీఎం విభాగానికి చెందిన 'టెస్లా', ఎస్ఎంఎస్ విభాగానికి చెందిన 'అభ్యుదయ్' బృందం ఉద్యోగులు మూడు బంగారు పతకాలు గెలుపొందారు. ఈ పోటీలకు యాజమాన్యం తరఫున స్టీల్‌ప్లాంట్ సీజీఎం యు.శ్రీధర్, ఎం.ఎస్.విభాగం డీజీఎం సంజయ్ రంజన్ దాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అభినందించారు.

అవినీతి రహిత దేశ నిర్మాణంలో భాగమవుదాం

తాటిచెట్లపాలెం: అవినీతి రహిత దేశ నిర్మాణంలో భాగస్వాములవుదామని వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో బుధవారం నిఘా అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. డివిజనల్ రైల్వే కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో డీఆర్ఎం సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. అవినీతి రహిత దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పాల్గొనే విధంగా ఆడియో, వీడియో సందేశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగులు, సిబ్బందికి సెమినార్స్, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లు, సబ్ డివిజనల్ యూనిట్లలో ఈ కార్యక్రమం జరిగింది. ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి పాల్గొన్నారు.

డయల్ యువర్ సీపీకి 17 ఫిర్యాదులు

దొండపర్తి: డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సీపీ తన చాంబర్‌లో డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 17 మంది ఫోన్ చేసి ఫిర్యాదులు చేశారు. సీపీ ప్రతి ఒక్క కాలర్ సమస్యలు తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వెంటనే ఆ ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు. కాలర్స్ ఇచ్చిన ఫిర్యాదుల్లో భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, సివిల్ కేసులు, వ్యాపారం కోసం నగదు ఇచ్చి మోసపోయిన వారు, నగర ట్రాఫిక్ సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి.

క్రీడాకారులు రిపోర్ట్ చేయాలి

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో ఈ నెల 2న నిర్వహించనున్న సాఫ్ట్ టెన్నిస్, మాల్కం గేమ్స్‌కి సంబంధించిన క్రీడాకారులు పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్‌లో రిపోర్ట్ చేయాలని డీఈవో చంద్రకళ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న తైక్వాండో అండర్–17 బాల బాలికల సెలక్షన్, 4న అండర్ –14 బాలబాలికల సెలక్షన్స్ చంద్రపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని పి.వి.నర్సింహరావు ఫంక్షన్ హాల్లో ఉంటాయన్నారు. క్రీడాకారులు ఆయా వేదికల వద్ద రిపోర్ట్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 7386354492, 8247375914 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అనుమతులు లేని మద్యం ఈవెంట్‌పై ఎక్సైజ్ దాడులు

సరఫరా చేసిన వ్యక్తి అరెస్ట్.. బెయిల్‌పై విడుదల

దొండపర్తి: బార్ లైసెన్సులు లేని హోటల్స్, ఫంక్షన్ హాల్స్‌లో ఈవెంట్ పర్మిట్ లేకుండా మద్యం సరఫరా చేస్తున్న వారిపై ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎస్‌బీసీఎల్) డిపో–1 ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎస్ఐ ఎ.రాజ్యలక్ష్మి సిబ్బందితో కలిసి దొండపర్తి ప్రాంతంలో ఉన్న బెస్ట్ వెస్టర్న్ ప్లస్ తేజ్‌వివాన్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. వీరిని చూసి మద్యం సేవిస్తున్న కొంత మంది పరారయ్యారు. అక్కడ తెలంగాణ రాష్ట్రానికి చెందిన 7 నాన్–డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో అనుమతులు లేకుండా మద్యం సరఫరా చేస్తున్న ఫుడ్ మేనేజర్ సోడి వెంకటేశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ ఫంక్షన్‌కు వచ్చిన వారిలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మద్యం బాటిళ్లు ఇచ్చి సరఫరా చేయమని చెప్పాడని అంగీకరించాడు. దీంతో అతడిని సీతమ్మధార ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి బెయిల్‌పై విడుదల చేశారు. దీనిపై విచారణ కొనసాగుతోందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ తెలిపారు. ఈవెంట్ పర్మిట్ లేకుండా మద్యం తాగడం, సరఫరా చేసినా చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఏదైనా మద్యం సరఫరా చేసే ఫంక్షన్‌కు హాజరయ్యే ముందు ఈవెంట్ పర్మిట్ ఉందో, లేదో పరిశీలించి పాల్గొనాలని సూచించారు. మద్యం దుకాణాల్లో జరిగిన ఉల్లంఘనలపై 2021 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు 21 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

జాబితాలో ఓటు చెక్ చేసుకోండిలా...

- ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోనూ ఓటు ఎక్కడ ఉందో చూసుకోవచ్చంటున్న ఎన్నికల కమిషన్
- పాత ఓటరు కార్డుపై బార్ కోడ్ స్కాన్ చేసినా వివరాలు ప్రత్యక్షం
- కొత్త కార్డుల పంపిణీలో విశాఖ జిల్లా జోరు
- కొత్త ఓటరు కార్డుపై క్యూఆర్ కోడ్ ముద్రించిన ఎన్నికల యంత్రాంగం
- ఓటు సరిచూసుకునేందుకు అందుబాటులోకి వెబ్‌సైట్, యాప్‌లు

సాక్షి, విశాఖపట్నం : ఓటు వజ్రాయుధం... రాష్ట్ర ప్రజల భవిష్యత్తును మార్చే ప్రధాన మంత్రం. అలాంటి ఓటుహక్కు ప్రతి ఒక్కరికీ అవసరం. ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టులాంటి ఓటు హక్కు మీకు ఉందా..? లేదా..? అనే సందేహాలను నివృత్తి చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నెల 27న ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. డిసెంబర్ 9 వరకూ అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉన్న తరుణంలో ఓటర్ల జాబితాలో పేరు చెక్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

వెబ్‌సైట్‌లో ఎలా చెక్ చేసుకోవాలంటే...

ఎన్నికల సంఘానికి చెందిన ఓటర్స్ సర్వీస్ పోర్టల్ https://voters.ece.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. 'సెర్చ్ ఇంజిన్స్ఎలక్టోరల్' కాలమ్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. ఇక్కడ సెర్చ్ బై డీటైల్స్, సెర్చ్ బై ఎపిక్, సెర్చ్ బై మొబైల్ ఆప్షన్లలో



సీఈవో ఆంధ్రా వెబ్‌సైట్

ఏదో ఒక దాన్ని ఎంపిక చేసుకోవాలి. దానిలో వివరాలు నమోదు చేయాలి. ఒక వేళ మీ ఫొటో గుర్తింపు కార్డు సంఖ్యను ఎంటర్ చేస్తే.. వెంటనే వివరాలు వస్తాయి. ఆ జాబితాలో మీ పేరు ఉందా..? లేదా..? ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది..? సీరియల్ నంబర్ ఎంత? వంటి వివరాలన్నీ కనిపిస్తాయి. మీ ఫొటో ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య తెలియకపోతే 'అడ్వాన్స్‌డ్ సెర్చ్' కాలమ్‌లోకి వెళ్లి పేరు, తండ్రి పేరు వివరాలు నమోదు చేస్తే ఓటరు జాబితాలో పేరు ఉందా..? లేదా? తెలుసుకోవచ్చు.

పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితా

http://ceoandhra.nic.in వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే పైభాగంలో పీడీఎఫ్ ఎలక్టోరల్ రోల్స్ అనే ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్ చేయాలి. అసెంబ్లీ, నియోజకవర్గం అని కనిపిస్తుంది. వాటిపై క్లిక్ చేసి మీ జిల్లా, మీ శాసనసభ నియోజకవర్గం ఎంపిక చేసుకోవాలి. ఆ నియోజకవర్గంలోని ఏ పోలింగ్ కేంద్రం పరిధిలోకి వస్తారో చూసుకుని దానికి సంబంధించిన ఓటర్ల జాబితాను పరిశీలించి మీ పేరుందా? లేదా? చూసుకోవచ్చు.

ఎన్‌వీఎస్‌పీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి..

www.nvsp.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ముందుగా మీ ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ కావాలి. ×రిజిస్టర్ యాజ్ ఏ న్యూ ఓటర్१అని ఆప్షన్ వస్తుంది. దానిపై క్లిక్ చేస్తే ఫారం - 6 అప్లికేషన్ ఫారం ఫర్ న్యూ ఓటర్ అని వస్తుంది. దానిపై క్లిక్ చేస్తే దరఖాస్తు వస్తుంది. అందులో పేర్కొన్న వివరాలన్నింటినీ నింపి సబ్‌మిట్ చేయాలి. తర్వాత మీ ఫోన్ నంబర్‌కు రిఫరెన్స్ ఐడీ నంబర్ వస్తుంది. ఆన్‌లైన్ చేసుకున్న దరఖాస్తులోని వివరాల ఆధారంగా బూత్‌స్థాయి అధికారి మీ చిరునామాకు వచ్చి పరిశీలిస్తారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో మీ పేరు చేర్చుతారు.

పోలింగ్ కేంద్రాల ద్వారా..

ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) ఉంటారు. వారి వద్ద ఈ కేంద్రానికి సంబంధించిన ఓటరు జాబితా ఉంటుంది. వాటిని పరిశీలించి ఓటు ఉందా..? లేదా..? చూసుకోవచ్చు. పాత ఓటరు కార్డుల ముందు భాగంలో బార్‌కోడ్‌లు ఉన్నాయి. కొత్తగా జారీ చేసిన కార్డులపై క్యూఆర్ కోడ్‌లను ముద్రించారు. ఆ కోడ్‌లను మీ ఫోన్‌లో స్కాన్ చేసినా మీ వివరాలు తెలుసుకోవచ్చు.

పేరు, వివరాల నమోదు ఇలా..

www.nvsp.in వెబ్‌సైట్‌లోకి వెళ్తే 'సెర్చ్ ఇంజిన్ ఎలక్టోరల్ రోల్' అనే కాలమ్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే 'సెర్చ్ బై డిటైల్స్', 'సెర్చ్ బై ఎలక్టోరల్ నంబర్' అనే రెండు ఆప్షన్లు వస్తాయి. మీ పేరు, తండ్రి పేరు, జిల్లా, నియోజకవర్గం తదితర వివరాలు లేదా ఓటరు గుర్తింపు కార్డు నంబర్ ఎంటర్ చేస్తే మీ పేరు ఉందా?లేదా?తెలుసుకోవచ్చు.

హెల్ప్‌లైన్ మొబైల్ యాప్‌లో..

గూగుల్ ప్లే స్టోర్‌లో భారత ఎన్నికల సంఘానికి సంబంధించిన ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ఉంటుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకొని మీ ఫోన్ నంబర్ వివరాలతో రిజిస్టర్ చేసుకొని లాగిన్ అవ్వాలి. యాప్‌లోకి ప్రవేశించిన వెంటనే పైభాగంలో 'సెర్చ్ యువర్ నేమ్ ఎలక్టోరల్ రోల్' అనే కాలమ్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే 'సెర్చ్ బై బార్‌కోడ్', 'సెర్చ్‌పై ఎలక్టోరల్ నంబర్' అనే నాలుగు ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో మొదటి రెండింటికి సంబంధించిన ఓటరు గుర్తింపు కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఓటరు జాబితాలో పేరుందా..? లేదా..? తెలుసుకోవచ్చు. మీ పేరు, తండ్రి పేరు, వయస్సు, జిల్లా, నియోజకవర్గం తదితర వివరాలు పొందుపర్చడం ద్వారా జాబితాలో పేరు ఉందా? లేదా? తెలుసుకోవచ్చు. అదేవిధంగా http://ceoandhra.nic.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఎన్‌వీఎస్‌పీ ఓటరు పోర్టల్ వెబ్‌సైట్ లింక్‌లోకి వెళ్లి కూడా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటు హక్కు నమోదు సహా ఇతరత్రా ఏమైనా సందేహాలుంటే 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చు.



మొబైల్‌యాప్

ఓటరు జాబితాలో పేరు లేకపోతే దరఖాస్తు ఇలా..

➡ బీఎల్‌వోకు నేరుగా ఫారం - 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

➡ ఈఆర్‌వో, ఏఈఆర్‌వో కార్యాలయాల్లో ఇవ్వొచ్చు.

➡ ప్రతి నియోజకవర్గానికి డివిజన్ స్థాయి అధికారిని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్‌వో)గా, ప్రతి మండలంలోనూ తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్‌ను అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఏఈఆర్‌వో)గా ఎన్నికల సంఘం నియమించింది. వారి కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. వారు విచారణ జరిపి ఓటు హక్కు కల్పిస్తారు.



ఓటర్స్ సర్వీస్ పోర్టల్

సాయి కౌశిక్‌కు రెండు రజతాలు



పతకాలతో కౌశిక్

విశాఖ స్పోర్ట్స్ : క్రాస్ బౌ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో సాయికౌశిక్ రెండు రజత పతకాలు సాధించాడు. ఆగ్రాలో జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో కాంపౌండ్, రికర్వ్ అంశాల్లో పోటీపడి రజతాల్ని అందుకున్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో గతంలో మూడు స్వర్ణాలు సాధించిన కౌశిక్ ఈ అంతర్జాతీయ పోటీల్లోనూ పతకాలు సాధించాడు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.61,530
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,400
వెండి(కిలో):	రూ.77,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.110
స్కిన్	: రూ.190
స్కిన్‌లెస్	: రూ.200

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	540.00
విజయనగరం	544.00
శ్రీకాకుళం	544.00

రేపు మినీ జాబ్‌మేళా

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 3న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయి కృష్ణ చైతన్య, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. ఆరోజు ఉదయం 9.30 గంటలకు వివిధ సంస్థల్లో 200 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

- టెక్విస్సెన్ సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణులై 25 ఏళ్లలోపు వయసున్న యువత అర్హులు. ఎంపికైన అభ్యర్థులు గంభీరంలో పనిచేయాల్సి ఉంటుంది. నెలకు రూ.16000 నుంచి రూ.20000 వరకు జీతం చెల్లిస్తారు.
- డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లో ఉద్యోగాలకు డిప్లమో లేదా బీటెక్ ఎలక్ట్రికల్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కెమికల్, ఎంఎస్సీ మైక్రో బయాలజీ లేదా బయో టెక్నాలజీలో 2022, 2023లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. 10వ తరగతిలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎంపికైన అభ్యర్థులు పైడిభీమవరం లేదా బాచుపల్లిలో పనిచేయాల్సి ఉంటుంది. నెలకు జీతం రూ.16000 నుంచి రూ.25000 వరకు ఉంటుంది.
- యోకోహామా టైర్స్‌కి సంబంధించి 2019–2024లో ఇంటర్, ఐటీ ఐ, డిగ్రీ, డిప్లమోలో ఉత్తీర్ణులైన యువతులు మాత్రమే అర్హులు. ఎంపికైన యువతులు అచ్యుతాపురంలోని ఏపీ సెజ్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. ట్రైనింగ్ తర్వాత నెలకు రూ.15000 వరకు జీతం చెల్లిస్తారు.
- రాలీవూల్ఫ్ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగాలకు డిప్లమో ఎలక్ట్రికల్ పాసైన యువకులు అర్హులు. వీరు విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కాకినాడ, హైదరాబాద్‌లలో పని చేయాల్సి ఉంటుంది. నెలకు రూ.16000 నుంచి రూ.18000 వరకు చెల్లిస్తారు. అలవెన్స్‌లు ఉంటాయి.
- ఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో పని చేయడానికి టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీలో పాసైన అభ్యర్థులు అర్హులు. ఎంపికై న అభ్యర్థులు మాధవధారలోని గిడ్డంగిలో పనిచేయాల్సి ఉంటుంది. నెలకు రూ.8000 నుంచి రూ.15000ల వరకు జీతం చెల్లిస్తారు. మరిన్ని వివరాలకు జిల్లా ప్లేస్‌మెంట్ అనుబంధ అధికారి రమేష్ నాయుడును 9292553352లో సంప్రదించవచ్చు.

విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

కొమ్మాది: తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 21, 22న ఆంధ్రప్రదేశ్ ఆమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ - 2023లో బంగారు, రజత పతకాలు సాధించిన విజేతలను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అభినందించారు. ఎండాడలో గల పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం విజేతలను కలిశారు. 41 కేజీల విభాగంలో ఎస్.నిఖిల్, 57 కేజీల విభాగంలో పి.వెంకటేష్ బంగారు పతకం సాధించగా సీనియర్ కేటగిరీలో అండర్ 63 కేజీల విభాగంలో బి.హేమంత్ శ్రీనాథ్ బంగారు పతకం సాధించాడు. బాలికల విభాగంలో అండర్ 47 కేజీల విభాగంలో ఎ.పవిత్ర రజిత పతకం సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆయన వీరిని అభినందించి భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, శ్రీ కనక మహాలక్ష్మి ట్రస్ట్ బోర్డు మెంబర్ వంకాయల మారుతీ ప్రసాద్, కోచ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం : విజయనగరం జిల్లా కంటకాపల్లి - అలమండ మధ్య గత ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదం కారణంగా పలు రైళ్లు రద్దు చేసినట్లు, మరికొన్ని రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

➡ చెన్నై సెంట్రల్ - సంత్రగచ్చి (22808) ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2న రద్దు. ➡ పూరీ - తిరుపతి (17479) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2న రద్దు.

➡ శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం - హౌరా (22832) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 3న రద్దు.

తిరుపతి – హౌరా వన్‌వే స్పెషల్

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి - హౌరా మధ్య వన్‌వే స్పెషల్ నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైలు సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. తిరుపతి - హౌరా (07163) వన్ వే స్పెషల్ తిరుపతిలో ఈ నెల 3న శుక్రవారం ఉదయం 10.55 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 11.02 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.25కు హౌరా చేరుకుంటుంది.

కోరాపుట్ వరకే కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్

భద్రతా కారణాల వల్ల కొత్తవలస - కిరండూల్ లైన్‌లో నడిచే విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ గమ్యం కుదించడంతో కోరాపుట్ వరకే నడుస్తుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నంలో రోజూ రాత్రి బయల్దేరే విశాఖపట్నం - కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2 నుంచి 5 వరకు కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో రోజూ బయల్దేరాల్సిన కిరండూల్ - విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2 నుంచి 6 వరకు కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

విజ్ఞాన దీపిక.. సృజనకు వేదిక

- జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఏర్పాట్లు
- సామాజిక సమస్యలే ప్రధాన అజెండా
- విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 543 ప్రాజెక్టుల నమోదు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులు

విశాఖ విద్య: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా పాఠశాల స్థాయిలో వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. సైన్స్ సంబంధిత రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు వారిని సమాజాభివృద్ధిలోనూ భాగస్వాములను చేసే చదువులకు ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి(ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పేరిట విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తోంది. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. 10 నుంచి 17 ఏళ్ల వయసు గల బడిబయట పిల్లలకు సైతం ఈ సారి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా సమస్యకు పరిష్కారం చూపి, తద్వారా సమాజానికి ప్రయోజనం చేకూర్చేందుకు ఈ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ వేదికగా నిలవనుంది.

భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేలా..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యార్థులు గుర్తించే సామాజిక సమస్యలకు వారే పరిష్కారం చూపేలా ప్రోత్సహించడమే ఈ పోటీల ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా ఈ ఏడాది 'ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం'అనే అంశంపై విద్యార్థుల ఆలోచన శక్తికి పదునుపెట్టేలా పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల నిర్వహణలో భాగంగా ఐదు ఉప అంశాలుగా విభజించారు.

ఐదు అంశాలివీ..

- మీ పర్యావరణ వ్యవస్థ గురించి తెలుసుకో..
- ఆరోగ్యం, పోషణ, సంక్షేమం పెంపొందించుకోవడం
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు
- స్వీయ-విశ్వాసం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణ

రాష్ట్రస్థాయికి ఉత్తమ ప్రాజెక్టులు ఎంపిక

జిల్లా స్థాయి పోటీలు మరో రెండు మూడు రోజుల్లోనే నిర్వహించేలా విద్యాశాఖాధికారులు సిద్ధమవుతున్నారు. విశాఖలో 273, అనకాపల్లి జిల్లాలో 270 ప్రాజెక్టులు ఇప్పటివరకు నమోదయ్యాయి. ఇందులో ఉత్తమ ఏడు ప్రాజెక్టులను ఈ నెల 29 ,30 తేదీల్లో విజయవాడ కె.ఎల్.యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు.

ఆలోచనలే కొలమానం



సమస్యలను గుర్తించడమే కాకుండా వాటికి పరిష్కారం సూచించేలా ప్రాజెక్టులు ఉండాలి. సొంత ఆలోచనలు, రూప కల్పనలో కొత్తదనం, సృజనాత్మకత తదితర అంశాలను పరిగణలోకి తీసుకుంటాం. ప్రాజెక్టు తయారీలో పొందుపరిచే సంక్షిప్త రిపోర్ట్ ఆంగ్లంలోనే ఉండాలి.

–పాలగుమ్మి రాజారావు, ఆప్‌కాస్ట్ కన్వీనర్, విశాఖ, అనకాపల్లి జిల్లాలు

విద్యార్థులకు చక్కటి అవకాశం



జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి తప్పనిసరిగా ప్రాజెక్టులు సమర్పించాలి. శాస్త్రీయ ఆలోచనలు, శాస్త్రీయ వైఖరులను ప్రదర్శించడానికి ఇదొక చక్కటి వేదిక. ఎక్కువ మంది విద్యార్థులు నమోదు చేసుకునేలా సైన్స్ ఉపాధ్యాయులు సహకరించాలి.

– ఎం.వెంకట లక్ష్మమ్మ, డీఈవో ,అనకాపల్లి జిల్లా

హెచ్‌ఎంలు బాధ్యత తీసుకోవాలి



విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో భాగస్వాములయ్యేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బాధ్యత తీసుకోవాలి. సైన్స్ ఉపాధ్యాయులను అప్రమత్తం చేయాలి. విద్యార్థులను సైన్సు సంబంధిత రంగాల్లో ప్రోత్సహించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయి.

–ఎం.జ్యోతి కుమారి, ఆర్జేడీ, విశాఖపట్నం

రైలు ప్రమాద బాధితులకు పరిహారం అందజేత


అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న మేయర్ హరివెంకటకుమారి


రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బి.తేజేశ్వరరావుకు రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నల్లా కుమారికి రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

ఆరిలోవ/మహారాణిపేట:/తాటిచెట్లపాలెం: విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాదంలో బాధితులకు త్వరితగతిన పరిహారం అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రమాదంలో మృతి చెందిన రైల్వే గార్డు మరిపి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ఆరిలోవలో బుధవారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి రూ.10 లక్షలు చెక్కును అందజేశారు. అనంతరం హెల్త్ సిటీలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్వతీపురం మన్యం జిల్లా ఇందిరాకాలనీకి చెందిన కోలా నానాజీకి రూ.5 లక్షల పరిహారం చెక్కును అందజేశారు. అలాగే రైలు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నల్లా కుమారికి రూ.5 లక్షలు, రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బి.తేజేశ్వరరావుకు రూ.2 లక్షల చొప్పున పరిహారం చెక్కులను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అందజేశారు. కార్యక్రమాల్లో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

రైల్వే శాఖ పరిహారం చెల్లింపు

రైలు ప్రమాదంలో గాయపడిన సుమారు 19 మందికి అదేరోజు కేవలం 6 గంటల వ్యవధిలోను, మిగిలిన 30 మందికి 12 గంటల వ్యవధిలో నష్టపరిహారం అందజేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. మృతుల కుటుబాలకు కూడా కేవలం 20 గంటల్లోనే పరిహారం అందజేసినట్లు పేర్కొన్నారు. రైల్వే ప్రకటించిన మొత్తం రూ.1.73 కోట్లు నష్టపరిహారం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

రేపు విత్తన బంతులు వెదజల్లే కార్యక్రమం

డాబాగార్డెన్స్: నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు ఈ నెల 3న ఎంపిక చేసిన ఏడు కొండల్లో విత్తన బంతులు వెదజల్లనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. ఐఎన్ఎస్ డేగా సహాయంతో హెలికాప్టర్ నుంచి 50 వేల విత్తన బంతులు వెదజల్లుతున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 2న నగర పరిధిలోని ఏడు కొండలపై 1.50 లక్షల విత్తన బంతులు చల్లినట్లు చెప్పారు. రెండో విడతగా ఈ నెల 3న భీమిలి పావురాల కొండ ప్రాంతంలో రెండు చోట్ల, కాపులుప్పాడ, సింహాచలం, మేహాద్రి వద్ద గల పార్లు పాలెం, యారాడ, వెదుర్ల నరవకొండలపై 50 వేల విత్తన బంతులను జారవిడుస్తామన్నారు.

నేటి నుంచి లిక్విడ్ క్రిస్టల్స్‌పై జాతీయ సదస్సు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై గురువారం నుంచి 30వ జాతీయ సదస్సు(ఎన్‌సీఎల్‌సీ 2023) జరగనుంది. ఇండియన్ లిక్విడ్ క్రిస్టల్స్ సొసైటీతో సంయుక్తంగా ఏయూ నిర్వహిస్తున్న ఈ సదస్సును వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రారంభిస్తారు. మూడు రోజుల సదస్సులో భాగంగా నిపుణుల ప్రసంగాలు, 30 ప్రజెంటేషన్లు, పోస్టర్స్ ప్రజెంటేషన్లు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

రోగులకు పురుగుల ఉప్మా

- కార్డియాలజీ విభాగంలో రోగి బంధువుల ఆందోళన
- ఎటువంటి పురుగులు లేవు: ఆస్పత్రి వర్గాలు


ఉప్మాను చూపిస్తున్న సత్యవతి

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగులకు ఇచ్చిన అల్పాహారంలో తెల్ల పురుగులు ఉండటం కలకలం రేపింది. కార్డియాలజీ విభాగంలో రోగులకు బుధవారం ఉప్మా అందజేశారు. ఈ ఉప్మాలో తెల్ల పురుగులు కనిపించడంతో రోగులు ఇబ్బంది పడ్డారు. పురుగులు ఉండే ఉప్మా ఎలా పెడతారంటూ అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలానికి చెందిన ఎం.సత్యవతి, వారి బంధువులు ఆందోళనకు దిగారు. ఉప్మాలో పురుగులు ఉన్నట్లు ఆమె మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా.. ఉప్మాలో ఎలాంటి పురుగులు లేవని కేజీహెచ్ చీఫ్ డైటీషియన్ హెచ్.వి.ఆర్.మూర్తి తెలిపారు. తాను కూడా ఉప్మాను పరిశీలించానని, ఎటువంటి పురుగులు లేవని కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ చెప్పారు. ఈ ఘటనపై సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవతో విచారణ చేయిస్తున్నట్లు వెల్లడించారు.

త్యాగమూర్తి.. పొట్టి శ్రీరాములు

- కలెక్టర్ మల్లికార్జున
- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం


కలెక్టరేట్‌లో తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ మల్లికార్జున


జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి మరువలేనిదని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు, తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. విద్యార్థులు మా తెలుగు తల్లికి.. మల్లెపూదండ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసి.. ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన మహా పురుషుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. భావితరాలకు స్వేచ్ఛాయుత, ప్రశాంత జీవనం అందించడమే లక్ష్యంగా సాగిన ఆయన పోరాటం.. చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నూతన రాష్ట్రంలో ఎన్నో మార్పులు, సంస్కరణలు చోటుచేసుకున్నాయని.. 26 జిల్లాలతో పునర్వ్యవస్థీకరణ జరిగిందన్నారు. విశాఖ జిల్లా అభివృద్ధి పథకంలో దూసుకుపోతోందన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం సాధించేందుకు 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణ త్యాగం చేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని అన్నారు. క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల్లో కూడా పొట్టి శ్రీరాములు పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆయన త్యాగానికి గుర్తుగా నెల్లూరు జిల్లాకు నెల్లూరు పొట్టి శ్రీరాములు జిల్లాగా నామకరణం చేశారన్నారు.

విభజనతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది

రాష్ట్రం మళ్లీ ముక్కలు కాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులు ప్రకటించారని ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు అన్నారు. ఇప్పటికే విభజనతో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని, అభివృద్ధి ఒకే దగ్గర కాకుండా అన్ని జిల్లాలకు విస్తరించాలన్న లక్ష్యంతో మూడు రాజధానుల ఆలోచన చేశారన్నారు. అందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామన్నారు. డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడిన కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, ఐసీడీఎస్ ప్రాంతీయ చైర్‌పర్సన్ మంతెన మాధవి, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఫుడ్ కమిషన్ మెంబర్ బి.కాంతారావు, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.మణిరామ్ పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు

అమరజీవి త్యాగనిరతి ఎనలేనిది


అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జీవీఎంసీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని అమరజీవి నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, యూసీడీ పీడీ పాపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి కృషి తరతరాలకు స్ఫూర్తి

కొమ్మాది: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా తెలుగు తల్లి, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు వారు పూలమాలలు వేశారు. డిప్యూటీ మేయర్ జి.శ్రీధర్, అదనపు కార్యదర్శి జి.రవిరెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్లు పిల్లా సుజాత సత్యనారాయణ, విజయచంద్ర, రాములప్పడు, బెందాళం పద్మావతి, మాధవి వర్మ, అప్పలకొండ, అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిలు వంకాయల మాతరుతీ ప్రసాద్, బోని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్ల పొదుపు సొమ్ము స్వాహా

పరారీలో కీలక పాత్రధారి వీవోఏ మంగతాయారు

అనకాపల్లి రూరల్: ప్రభుత్వం పొదుపు సంఘాలకిస్తున్న రుణాలను అక్రమార్కులు స్వాహా చేసిన వ్యవహారం అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో వెలుగు చూసింది. సుమారు రూ.2 కోట్ల నిధులను డూప్లికేట్ గ్రూపుల పేరుతో స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు బుధవారం సత్యనారాయణపురం కల్యాణమండపంలో బినామీ రుణాల వ్యవహారంపై డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, యలమంచిలి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ విచారణ చేపట్టారు. వీవోఏ కండిపిల్లి మంగతాయారు అంతా తానై ఈ వ్యవహారాన్ని నడిపినట్టు విచారణలో పలువురు పొదుపు సంఘాల మహిళలు రాతపూర్వక వాంగ్మూలం ఇచ్చారు. అనకాపల్లి బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఐదు గ్రూపుల పేరుతో రూ.85 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడాలో 7 గ్రూపుల పేరున రూ.82 లక్షలు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ.35.20 లక్షలు రుణాల రూపంలో పక్కదారి పట్టినట్టు విచారణలో వెల్లడైంది. మంగతాయారు 15 రోజుల నుంచి పరారీలో ఉందని పలువురు బాధిత పొదుపు మహిళలు అధికారులకు తెలిపారు. రెండ్రోజుల్లో కలెక్టర్‌కు సమగ్ర నివేదిక పంపిస్తామని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి తెలిపారు.

జాతీయ క్రీడలకు హర్షిణి విశ్వనాథ్ ఎంపిక

సహాయ సహకారాలు అందించాలని టెన్నిస్ క్రీడాకారిణి విన్నపం



సీతమ్మధార: నగరంలోని సీతమ్మధారకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి హర్షిణి విశ్వనాథ్ గోవా జాతీయ క్రీడలు–2023కు ఎంపికైంది. మహిళల టెన్నిస్ టోర్నమెంట్‌లో పోటీ పడనుంది. ఈ టోర్నీలో భారత్ నుంచి 16 మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారు. అఖిల భారత మహిళా టెన్నిస్ పోటీల్లో హర్షిణి 34వ ర్యాంకు, జూనియర్ విభాగంలో 20వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం సానియా మీర్జా టెన్నిస్ అకాడమీలో ఇమ్రాన్ మీర్జా మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతోంది. మొహమ్మద్ ఆధ్వర్యంలో కోచింగ్ తీసుకుంటోంది. తన లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రభుత్వం నుంచి, టెన్నిస్ ఔత్సాహికుల నుంచి సహాయ సహకారాలు అందించాలని హర్షిణి విశ్వనాథ్ ఈ సందర్భంగా కోరింది. గోవా జాతీయ క్రీడల్లో గెలిచి రాష్ట్రంతో పాటు విశాఖకు మంచి పేరు తెస్తానని ఆకాంక్షను వ్యక్తం చేసింది.